
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శనివారం । 12 । ఆగస్టు । 2023



సోమశిలలో 22.32 టీఎంసీలు
చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో శుక్రవారానికి 22.328 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 89.145 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.60,700
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.5,451
మూడు శాతం జీఎస్టీతో	రూ.5,615
సవర (8 గ్రాములు)	రూ.44,920

గరిష్టం/కనిష్టం
35.3 /26.7

వాతావరణం
వాతావరణంలో తేమ 53 శాతంగా ఉంది. జిల్లావ్యాప్తంగా పొడి వాతావరణం శనివారం ఉంటుందని అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

ఐటీఐలో జాబ్‌మేళా



మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు (టౌన్): వెంకటేశ్వరపురంలోని ప్రభుత్వ బాలుర ఐటీఐలో జాబ్‌మేళాను ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఆటోసెన్స్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, టీసీఎల్, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, ఫ్లిప్‌కార్ట్, ఇన్నోవో సోర్స్, రిలయెన్స్ స్మార్ట్, అపోలో ఫార్మసీ, వెర్‌మెరైన్, ఎన్నెస్ ఇన్‌స్ట్రుమెంట్స్, అమర్‌రాజా బ్యాటరీస్, తదితర కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. జాబ్ మేళాకు 348 మంది హాజరుకాగా, 152 మందిని ఎంపిక చేశారని కళాశాల ప్రిన్సిపల్ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి అధికారి విజయ్‌వినీల్‌కుమార్, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీ రంగా వర్సిటీ బోర్డు మెంబర్‌గా దేగపూడి



కోదండరామిరెడ్డి

పొదలకూరు: ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయ బోర్డు మెంబర్‌గా జిల్లాకు చెందిన విశ్రాంత వ్యవసాయ శాస్త్రవేత్త దేగపూడి కోదండరామిరెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు ఉత్తర్వులు అందాయి. పొదలకూరు, నెల్లూరులోని చిరు ధాన్య పరిశోధన స్థాన ప్రధాన శాస్త్రవేత్తగా చాలాకాలం ఈయన పనిచేశారు. పొదలకూరులో ఏజీ పాలిటెక్నిక్ కాలేజీని 2005లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి స్థాపించిన సమయంలో కోదండరామిరెడ్డి ప్రధాన శాస్త్రవేత్తగా కొనసాగుతూ ప్రిన్సిపల్‌గా విశేష సేవలు అందించారు.

114 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



కావలి: గుడ్లూరు నుంచి కావలికి అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులు పక్కా సమాచారంతో శుక్రవారం దాడులు చేసి పట్టుకున్నారు. 114 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. పౌరసరఫరాల శాఖ కావలి డిప్యూటీ తహసీల్దార్ వెంకట్రామిరెడ్డి కథనం మేరకు.. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులతో కలిసి కావలి మండలం మద్దూరుపాడు వద్ద నిఘా ఉంచగా, కావలికి రెండు వాహనాల్లో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గుర్తించామని తెలిపారు. బొలెరో వాహనంలో 60, మరో వాహనంలో 54 బస్తాల బియ్యాన్ని తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నామని వివరించారు. బియ్యం తరలిస్తున్న వ్యక్తులపై 6ఏ కింద కేసులు నమోదు చేశామన్నారు.

కేజీబీవీల్లో పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (టౌన్): కస్తూర్బాగాంధీ బాలిక విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న కుక్స్, అసిస్టెంట్ కుక్స్, వాచ్‌మెన్, స్వీపర్ల పోస్టులకు దినసరి వేతనం కింద పనిచేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని సమగ్రశిక్ష ఏపీసీ ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023 – 24 విద్యా సంవత్సరానికి సంబంధించి మూడు నెలలు లేదా అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన నాన్ టీచింగ్ స్టాఫ్‌ను భర్తీ చేసేంత వరకు పనిచేయాల్సి ఉంటుందని, నెలకు రూ.ఏడు వేల వేతనాన్ని ఇవ్వనున్నామని చెప్పారు. జిల్లాలో 12 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 14 నుంచి 19లోపు సమగ్రశిక్ష కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. కనీస విద్యార్హత ఏడో తరగతి ఉండాలని, దరఖాస్తుతో పాటు ఏడో తరగతి స్టడీ, పుట్టిన తేదీ, కుల, నివాస ధ్రువీకరణ పత్రాల సర్టిఫికెట్ల ఒరిజినల్స్‌తో పాటు ఒక సెట్ జిరాక్స్‌ను అందజేయాలన్నారు. ఈ నెల 31 నాటికి అభ్యర్థుల వయస్సు 18 నుంచి 42 ఏళ్లలోపు ఉండాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 47, ఫిజికల్లీ చాలెంజ్డ్ అభ్యర్థులకు 52 ఏళ్ల వయస్సు ఉండాలన్నారు.

పొలానికి పోదాం.. చలో.. చలో

వ్యవసాయంలో విద్యార్థినుల భాగస్వామ్యం
- కోర్సులో ఆర్నెల్లు పంటల సాగు
- ఏజీ పాలిటెక్నిక్ కాలేజీలో వినూత్న పద్ధతులు
- ఆధునిక సేద్యంపై అవగాహన
- పండిన పంటలు మార్కెట్లో విక్రయం

తరగతిలో పాఠాలు విని చదువుకోవడం ఒక ఎత్తయితే.. క్షేత్రస్థాయిలో తిరిగి వాటిపై అవగాహన పెంచుకోవడం మరో ఎత్తు. ఈ రకంగా విద్యార్థినులు క్షేత్రస్థాయిలో ఆర్నెల్ల పాటు పంటలను సాగు చేసి వ్యవసాయంపై పట్టు సాధించేలా పొదలకూరులోని ఏజీ పాలిటెక్నిక్ కళాశాల ప్రత్యేక చర్యలు చేపడుతోంది. దిగుబడైన పంటలను మార్కెటింగ్ చేసే అంశంలోనూ తర్ఫీదునిస్తోంది.

పొదలకూరు: దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో స్థాపించిన వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు ఎంతో ఉపయోగపడుతోంది. గ్రామీణ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థినులకు పాలిటెక్నిక్ సీట్ల కేటాయింపులో ప్రాధాన్యమిస్తున్నారు. కౌన్సెలింగ్ ద్వారా ఇక్కడి ఏజీ పాలిటెక్నిక్ కళాశాలలో రెండేళ్ల కోర్సులో రాష్ట్ర నలుమూలల నుంచి విద్యార్థినులు చేరుతున్నారు.

70 మంది విద్యార్థినులు

పొదలకూరు చిరుధాన్య పరిశోధన స్థానంలో ఏర్పాటు చేసిన ఏజీ పాలిటెక్నిక్ కాలేజీని విద్యార్థినులకు మాత్రమే కేటాయించారు. ప్రారంభంలో కొన్నేళ్లు కోఎడ్యుకేషన్ ఉన్నా, అనంతరం సోమశిలలో బాలురకు ప్రత్యేకంగా కళాశాలను ఏర్పాటు చేశారు. కళాశాలలో ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 70 మంది విద్యార్థినులు ప్రస్తుతం ఉన్నారు. ప్రథమ సంవత్సరంలో చేరేవారికి మొదటి కౌన్సెలింగ్‌ను పూర్తి చేశారు.

సబ్జెక్టులివే..

పాలిటెక్నిక్‌లో వ్యవసాయానికి సంబంధించిన సబ్జెక్టులే ఉంటాయి. అగ్రానమి (పంటల యాజమాన్యం), ఎంటమాలాజీ (కీటకాలు), పెథాలజీ (చీడ పీడలు), సాయిల్ కెమిస్ట్రీ (భూసారం), ఫర్టిలైజర్స్ (ఎరువులు), అగ్రికల్చరల్ ఎకనమిక్స్ (వ్యవసాయ అర్థశాస్త్రం), అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ (వ్యవసాయ విస్తరణ), అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ (పంపుసెట్లు) కోర్సులో భాగంగా ఉంటాయి. వీటిపై సెమిస్టర్ పద్ధతిలో పరీక్షలను నిర్వహిస్తారు. ప్రాక్టికల్స్‌లో భాగంగా ఆర్నెల్ల పాటు విద్యార్థినులు ఫీల్డ్ వర్క్ చేయాలి. వ్యవసాయ భాగస్వామ్యంలో అపరాల సాగు చేసి దిగుబడి సాధించి వాటిని మార్కెటింగ్ చేయాల్సి ఉంటుంది.



పొలంలో పనిచేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థినులు

అపరాల సాగు

➡ ఏజీ పాలిటెక్నిక్ విద్యార్థినులు అపరాల సాగు చేస్తున్నారు. విద్యార్థులు బృందాలుగా ఏర్పడి వేరుశనగ, జొన్న, పెసర, మినుము పంటల సాగు చేపట్టారు. వేరుశనగలో ధరణి రకం 105 నుంచి 110 రోజుల్లో చేతికందే పంట. 110 రోజుల్లో చేతికందే కదిరి – 9 రకాన్ని సైతం సాగు చేస్తున్నారు.

➡ పెసరలో డబ్ల్యూజీజీ – 42 (వరంగల్) 55 నుంచి 60 రోజుల పంట. ఐపీఎం 2 – 14 రకం 60 నుంచి 65 రోజుల్లో చేతికందుతుంది. ప్రమాదకరమైన పల్లాకు తెగులు తట్టుకుంటున్న పెసర పంట కావడంతో రైతులకు వివరించేందుకు ఉపయోగపడుతుంది. సజ్జ, కంది, జొన్న పంటలను సాగు చేస్తూ మెలకువలను రైతులకు వివరిస్తున్నారు.

వర్షాధారంగానే పంటలు

వ్యవసాయ పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న పంటలకు నీటి లభ్యత తక్కువగా ఉంటోంది. దీంతో ఖరీఫ్‌లో వర్షాధారంగానే పంటలను పండిస్తారు. ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ట్రైల్ సాగుకు వచ్చిన ఇబ్బందులు ఉండవని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా పరిశోధన స్థానంలో నీటి లభ్యత కోసం వ్యవసాయ నీటి కుంటను తవ్వించారు. గతంలో ఉన్న నీటి కుంటతో పాటు కొత్తగా తవ్విన కుంటల్లో వర్షపు నీటిని నింపితే భూగర్భ జలాలతో పాటు పంటలకు నీరుపెట్టుకునేందుకు అవకాశం ఏర్పడుతుంది.

పంటలు పండించి.. ఆపై మార్కెటింగ్

ఏజీ పాలిటెక్నిక్ కళాశాలలో వ్యవసాయ భాగస్వామ్యం కింద ఆర్నెల్ల పాటు విద్యార్థినులే పంటలు పండించి.. దిగుబడైన అనంతరం మార్కెటింగ్ చేస్తారు. ఈ నేపథ్యంలో ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని పొదలకూరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినులు భాగస్వామ్య యాజమాన్య వ్యవసాయం చేస్తున్నారు. తక్కువ నీటితో యాజమాన్య పద్ధతులు.. రైతు తన పంటను ఎలా కాపాడుకుంటారనే అంశాలపై విద్యార్థులు నాలుగు బృందాలుగా విడిపోయి వ్యవసాయం చేస్తున్నారు. పంటలకు శాస్త్రవేత్తల పేర్లను ఏజీ పాలిటెక్నిక్ విద్యార్థినులు పెట్టారు.



విద్యార్థినులతో ముచ్చటిస్తున్న ఎన్జీ రంగా వర్సిటీ వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి (ఫైల్)

వ్యవసాయంపై పెరిగిన అవగాహన



ఫీల్డ్‌లో పనులు చేయడం ద్వారా వ్యవసాయంపై అవగాహన పెరిగింది. అపరాల సాగు చేసి మెట్ట పంటలు పండించే రైతులకు అవగాహన కల్పిస్తాం. అవసరమైతే గ్రామీణ ప్రాంతాల్లో సాగు చేసే పంటల వద్దకూ కళాశాల అధ్యాపకులు తీసుకెళ్తారు.
– స్వాతి, విద్యార్థిని, సైదాపురం

ఫీల్డ్ విజిట్‌తో చాలా నేర్చుకోవచ్చు



గ్రామీణ ప్రాంతాల్లో ఫీల్డ్ విజిట్‌తో చాలా అంశాలను నేర్చుకునేందుకు అవకాశం కలుగుతుంది. ప్రాక్టికల్స్‌లో భాగంగా కాలేజీలో పప్పు ధాన్యాలను పండిస్తున్నాం. చీడపీడలకు మందుల పిచికారీ, తదితర అంశాలపై అవగాహన పెరుగుతుంది.
– మేఘన, సాలూరు, విజయనగరం జిల్లా

క్షేత్రస్థాయిలో అవగాహన కోసమే..



ఏజీ పాలిటెక్నిక్ విద్యార్థులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయంపై అవగాహన కోసం వారితో పంటలను సాగు చేయిస్తున్నాం. ప్రాక్టికల్స్‌లో భాగంగా వ్యవసాయ పనులను చేయిస్తున్నాం. పంటల దిగుబడి పెరిగితే సాగు పద్ధతులను రైతులకు విద్యార్థినులతో వివరిస్తున్నాం. ఏజీ పాలిటెక్నిక్‌లో సీట్లను 25 నుంచి 35కు పెంచారు.
– వెంకటేశ్వర్లు, ఏజీ పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపల్, ప్రధాన శాస్త్రవేత్త, పొదలకూరు

ఆక్వా రంగాన్ని ప్రోత్సహించాలి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి
- సీ ఫుడ్ ఫెస్టివల్ ప్రారంభం

నెల్లూరు(దర్గామిట్ట): సీ ఫుడ్‌ను విరివిగా తీసుకొని ఆక్వా రంగాన్ని ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో మూడో సీ ఫుడ్ ఫెస్టివల్‌ను శుక్రవారం ప్రారంభించిన అనంతరం స్టాళ్లను మంత్రి పరిశీలించారు. ప్రదర్శనశాలలో వివిధ రకాల చేపలు, రొయ్యలు, పీతలు, ఆహార పదార్థాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఫిష్ ఆంధ్రా పేరుతో అవుట్‌లెట్లను ఏర్పాటు చేసి మత్స్యసంపదను ప్రజలకు చేరువ చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వెల్లడించారు. అనేక రకాల మత్స్య సంపద.. ఆహార పదార్థాల వినియోగం.. ఎక్కడ దొరుకుతాయనే అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన సీ ఫుడ్ ఫెస్టివల్ ద్వారా కలుగుతోందని చెప్పారు. రొయ్యల ఉత్పత్తిలో దేశంలోనే రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని వివరించారు. ఆక్వా రైతులను సీఎం అన్ని విధాలా ప్రోత్సహిస్తున్నారని, యూనిట్ విద్యుత్‌ను రూ.ఒకటిన్నరకే సబ్సిడీపై అందిస్తున్నారని తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు అన్ని విధాలా సహకరిస్తున్నారని పేర్కొన్నారు.



సీ ఫుడ్ ఫెస్టివల్‌ను ప్రారంభిస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి



స్టాల్‌ను పరిశీలిస్తున్న జేసీ, కమిషనర్

మత్స్య ఉత్పత్తుల వినియోగం పెరగాలి

రాష్ట్రంలో మత్స్య ఉత్పత్తులు అధికంగా అందుబాటులో ఉన్నాయని, వీటి వినియోగం పెరగాలని ఎమ్మెల్సీ కల్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. ఆక్వా రంగం, మత్స్య ఉత్పత్తుల ప్రోత్సాహానికి సీఎం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. వివిధ రకాల మత్స్య ఉత్పత్తులను వినియోగదారులకు చేరువ చేయడమే ఫిష్ ఆంధ్రా అవుట్‌లెట్ల ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల ఏర్పాటు

ప్రస్తుతం ఏడాదికి సగటున ఆరు నుంచి ఏడు కిలోల వరకు మత్స్య ఉత్పత్తులను ప్రజలు ఆహారంగా తీసుకుంటున్నారని, ఇది 20 నుంచి 22 కిలోలకు పెరగాల్సిన అవసరం ఉందని ఆప్కాఫ్ చైర్మన్ అనిల్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది ఫిషింగ్ హార్బర్ల నిర్మాణాలను చేపట్టారని వెల్లడించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, జేసీ కూర్మనాథ్, కమిషనర్ వికాస్ మర్మత్, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు, మెరైన్ జేడీ వెంకటేశ్వర్లురెడ్డి, డీఎల్డీఏ చైర్మన్ విజయ్‌కుమార్, భూమి ఆర్గానిక్స్ ఎండీ రఘురామ్, ఎస్‌ఎఫ్‌బీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ భార్గవి, నాబార్డు డీడీఎం రవిసింగ్, ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




పోలీస్ సిబ్బంది నుంచి గౌరవవందనాన్ని స్వీకరిస్తున్న తిరుమలేశ్వరరెడ్డి

ఉత్సాహంగా పరేడ్ రిహార్సల్స్

నెల్లూరు(క్రైమ్): స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో కవాతు రిహార్సల్స్‌ను పోలీస్ సిబ్బంది శుక్రవారం చేపట్టారు. దీన్ని వీక్షించి సిబ్బంది నుంచి గౌరవ వందనాన్ని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి స్వీకరించారు. స్వాతంత్య్ర దినోత్సవాన మరింత ఉత్సాహంగా కవాతును నిర్వహించాలని సూచించారు. అనంతరం నిర్వహించిన పోలీస్ సంక్షేమ దివస్ కార్యక్రమంలో సిబ్బందితో ముఖాముఖి మాట్లాడి ఆరోగ్య, వ్యక్తిగత, బదిలీలు, పదోన్నతులు, తదితరాలపై అర్జీలను స్వీకరించారు. వీటిని నిశితంగా పరిశీలించి అడ్మినిస్ట్రేటివ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఏఎస్పీలు ప్రసాద్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు (దర్గామిట్ట): రాష్ట్రంలోని మహిళలకు అండగా నిలుస్తూ.. వారి ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, కలెక్టర్ హరినారాయణన్, డీఆర్డీఏ, మెప్మా పీడీలు సాంబశివారెడ్డి, రవీంద్ర తదితరులు హాజరయ్యారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా జిల్లాలో డీఆర్డీఏ ద్వారా 31,674 స్వయం సహాయక గ్రూపుల్లోని 3.52 లక్షల మంది సభ్యులకు రూ.40.26 కోట్లు.. మెప్మా ద్వారా 10,295 స్వయం సహాయక గ్రూపుల్లోని 1,05,305 మంది సభ్యులకు రూ.16.62 కోట్ల మెగా చెక్కులను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అర్హత గల స్వయం సహాయక సంఘాలకు వైఎస్సార్ సున్నా వడ్డీని నేరుగా వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేశారని వివరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 41,969 స్వయం సహాయ సంఘాలకు రూ.56.88 కోట్లను వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా విడుదల చేశారని వెల్లడించారు. రుణాలను సద్వినియోగం చేసుకొని తమ జీవన ప్రమాణాలను మెరుగుపర్చుకున్నప్పుడే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని తెలిపారు.



వైఎస్సార్ సున్నా వడ్డీ నమూనా చెక్కును అందజేస్తున్న హరినారాయణన్

మహిళా సంక్షేమానికి కృషి



యూనస్ పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉంటూ బ్యాంక్ లింకేజీ రుణాన్ని పొంది గ్రామంలో చీరల వ్యాపారం చేస్తున్నా. వైఎస్సార్ సున్నా వడ్డీ నాకు వర్తించింది. సీజన్‌ను బట్టి నెలకు రూ.8వేల నుంచి రూ.15వేల వరకు ఆదాయమొస్తోంది. మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న సీఎంకు రుణపడి ఉంటాం.
– శారమ్మ, మినగల్లు, బుచ్చిరెడ్డిపాళెం

ఆర్థికంగా అండగా నిలుస్తోంది



భాగ్యలక్ష్మి పొదుపు సంఘంలో సభ్యురాలిని. మా సంఘం ద్వారా బ్యాంక్ నుంచి రుణం పొంది చీరల వ్యాపారం చేస్తూ నెలకు రూ.10 వేల ఆదాయం పొందుతున్నా. ఈ ఏడాది మా సంఘానికి రూ.20 వేల నిధులు సున్నా వడ్డీ ద్వారా జమయ్యాయి. సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు
– సుగుణమ్మ, చినపడుగుపాడు, కోవూరు

ఏసీబీ వలలో పంచాయతీ కార్యదర్శి

- రూ.20 వేలు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టివేత



జానకిరామయ్యతో ఏసీబీ అధికారులు

కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం పంచాయతీ కార్యదర్శి జానకిరామయ్యను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా శుక్రవారం సాయంత్రం పట్టుకున్నారు. గ్రామానికి చెందిన రవిశంకర్‌ను ఇంటి ప్లానింగ్ అప్రూవల్, ఎన్‌ఓసీ కోసం రూ.20 వేలు, ఒక కంప్యూటర్ ప్రింటర్‌ను లంచంగా జానకిరామయ్య డిమాండ్ చేశారు. వీటిని ఇవ్వడం ఇష్టంలేని బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు యల్లాయపాళెం పంచాయతీ కార్యాలయంపై దాడులు చేశారు. పంచాయతీ కార్యదర్శి జానకిరామయ్యకు రూ.20 వేల లంచాన్ని బాధితుడు ఇస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం జానకిరామయ్యను ఏసీబీ అధికారులు రెండు గంటల పాటు విచారించారు. పలు అవినీతి చర్యలకు పాల్పడిన అంశాన్ని విచారణలో అంగీకరించారని సమాచారం. అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ మోహన్ వెల్లడించారు. ఎవరైనా లంచం డిమాండ్ చేసినా.. అవినీతికి పాల్పడినా టోల్ ఫ్రీ నంబర్ 14400కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, కిరణ్, ఆంజనేయరెడ్డి, ఏఎస్సై సురేష్, కానిస్టేబుళ్లు వంశీ, కిరణ్, మాలకొండయ్య, నరసింహ, అన్నపూర్ణ పాల్గొన్నారు.

బాధితుల ఫిర్యాదు

పంచాయతీ కార్యదర్శి జానకిరామయ్యను ఏసీబీ అధికారులు పట్టుకున్న విషయం గ్రామస్తులకు తెలియడంతో పంచాయతీ కార్యాలయానికి పలువురు చేరుకున్నారు. జానకిరామయ్యపై పలు ఫిర్యాదులు చేశారు. ప్రతి చిన్న పనికీ లంచాన్ని డిమాండ్ చేస్తారని, లేని పక్షంలో అనవసర నిబంధనల పేరుతో ఇబ్బంది పెడతారని ఏసీబీ అధికారులకు తెలిపారు.

క్లుప్తంగా

అభయాంజనేయస్వామి ఆలయంలో చోరీ



చోరీ ఘటనపై పరిశీలిస్తున్న మర్రిపాడు పోలీసులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం డీసీపల్లిలోని అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం రాత్రి ఓ దొంగ చోరీకి పాల్పడ్డాడు. ఆలయానికి నాలుగువైపులా సీసీ కెమెరాలు ఉన్నాయి. ముఖానికి ముసుగు వేసుకున్న ఓ వ్యక్తి రెండు సీసీ కెమెరాలను ధ్వంసం చేసి ఆలయంలోకి ప్రవేశించాడు. హుండీని పగులగొట్టి అందులోని నగదును అపహరించాడు. శుక్రవారం ఉదయం చోరీని గుర్తించిన స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ధ్వంసం చేసిన సీసీ కెమెరాలను సమీపంలోని చెరువులో ఒకటి, పంట కాలువలో మరొకటి గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విశ్వనాథరెడ్డి తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఏడుగురి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): వైఎస్సార్‌సీపీ నాయకులు అరవ శౌరీ, మస్తానీ దంపతులపై హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితుడైన టీడీపీ నాయకుడు, రౌడీషీటర్ కప్పిర శ్రీనివాసులతో పాటు మరో ఆరుగురు నిందితులను సంతపేట పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. పోలీసుల సమాచారం మేరకు..సంతపేటకు చెందిన అరవ శౌరీ, మస్తానీ దంపతులు వైఎస్సార్‌సీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన టీడీపీ నాయకుడు, రౌడీషీటర్ కప్పిర శ్రీనివాసులు, ఆయన భార్య రేవతి వారిపై తరచూ అక్కసు వెళ్లగక్కుతుండేవారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి శౌరీ, మస్తానీ దంపతులపై కప్పిర శ్రీనివాసుల దంపతుల ప్రోద్బలంతో కల్లు చిన్న, ఇమానుయేల్, శ్రీఖర్, ఎం చిన్న, కే సాయి, ఏ వెంకటేశ్వర్లు, అనూష, కనక, భాగ్య, కామాక్షి, ఎం లక్ష్మి, ఉష కత్తులు, రాడ్‌లు, కర్రలతో విచక్షణా రహితంగా దాడిచేశారు. ఈ ఘటనలో శౌరీ దంపతులకు తీవ్రగాయాలయ్యాయి. బాధితురాలు మస్తానీ ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కప్పిర దంపతులతో పాటు మరో 12 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం కప్పిర శ్రీనివాసులతో పాటు ఎం చిన్న, ఎం లక్ష్మి, కే ఉష, కామాక్షి, ఏ భాగ్య, కే కనకను అరెస్ట్ చేశారు. మిగిలిన నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

బస్సు దగ్ధంపై పరిశీలన

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు గురువారం రాత్రి చెన్నైకు వెళ్తుండగా మాధవరం బస్సు డిపో సమీపంలో దగ్ధమైన విషయం తెలిసిందే. శుక్రవారం నెల్లూరు రీజనల్ మేనేజర్ శేషయ్య, మెకానికల్ ఇంజినీర్ శ్రీనివాసులురెడ్డి, ఆత్మకూరు డిపో మేనేజర్ కరీమున్నీసా, ఏఎంఎఫ్ వర్మ, తదితరులు చెన్నైకు చేరుకుని తమిళనాడు అధికారులతో కలిసి బస్సు దగ్ధమైన తీరును పరిశీలించారు. అగ్నికి ఆహుతైన బస్సును నెల్లూరు–1 డిపోకు తరలిస్తున్నామని తెలిపారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలను ఫోరెన్సిక్ పరీక్షల ద్వారా తెలుసుకుంటామని చెప్పారు. ఆ నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఏపీఎం వేధింపుల నుంచి కాపాడండి

నెల్లూరు(దర్గామిట్ట): కోవూరు మండల వైఎస్సార్ క్రాంతి పథం ఇన్‌చార్జి ఏపీఎం వెంకటస్వామి వేధింపుల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన వీఓఏలను కాపాడాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు దేవరపల్లి సురేష్‌బాబు కోరారు. ఈ మేరకు కలెక్టర్ హరినారాయణన్‌ను శుక్రవారం కలిసి విన్నవించారు. ఇన్‌చార్జి ఏపీఎం అసభ్యపదజాలంతో వీఓఏలను దూషించడమే కాకుండా స్త్రీనిధి నిధులు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయన్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే తనకు రాజకీయ పలుకుబడి ఉందని బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఏపీఎం అవినీతి, వేధింపులపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ముగ్గురి హత్య కేసులో నిందితుల అరెస్ట్

కావలి: బోగోలు మండలం కొండబిట్రగుంటలో ఒకే ఇంట్లో ముగ్గురిని దారుణంగా హతమార్చిన ఘటనలో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నెల 5న కుటుంబ కలహాలు, ఆస్తి వివాదాల నేపథ్యంలో సొంత కోడలితో పాటు ఆమె నాన్న, అమ్మమ్మను అత్త, మామ, మరిది కలిసి దారుణంగా హత్య చేసిన ఘటన జిల్లాలో తీవ్ర సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఘటన జరిగిన రోజు నుంచి నిందితులు పరారీలో ఉండగా పోలీసులు నిఘా ఉంచి శుక్రవారం అరెస్ట్ చేశారు. కావలి డీఎస్పీ వెంకట రమణ నిందితుల వివరాలను వెల్లడించారు. వివరాలు.. కొండబిట్రగుంటకు చెందిన మందాటి మధుసూదన్‌కు, బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన వాడకుప్ప మౌనికతో తొమ్మిదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి సుమారు ఎనిమిదేళ్ల వయస్సున్న బాబు ఉన్నాడు. రైల్వే ఉద్యోగిగా పనిచేసే మధుసూదన్ తరచూ మద్యం సేవించి భార్యతో గొడవపడేవాడు. ఈ నేపథ్యంలో భార్యభర్తలిద్దరూ నాలుగేళ్లుగా విడిగా ఉంటున్నారు. మౌనిక తన కుమారుడిని బుచ్చిలోని అమ్మమ్మ వద్ద ఉంచి తను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నారు. ఈ క్రమంలో గతనెల 28న భర్త గుండెపోటుతో చనిపోవడంతో మౌనిక కొండబిట్రగుంటలోని అత్తగారింటికి వచ్చింది. ఆమెకు తోడుగా ఆమె నాన్న వాడకుప్ప కృష్ణయ్య, అమ్మమ్మ శాంతమ్మ కూడా వచ్చి కొండబిట్రగుంటలోనే ఉన్నారు. ఈ క్రమంలో ఆస్తి గొడవలు తలెత్తడంతో ఈనెల 5వ తేదీ అర్ధరాత్రి సమయంలో మౌనిక అత్తమామలైన మందాటి మాల్యాద్రి, మందాటి ధనమ్మ, మరిది మాళిచంద్రలు ఇనుప రాడ్లతో దాడి చేసి ముగ్గురిని హతమార్చారు. మౌనిక తల్లి వాడకుప్ప పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి బుడంగుంట గేటు వద్ద నిందితులను అదుపులోకి తీసుకున్నారు.



విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న కావలి డీఎస్పీ వెంకట రమణ

పేదల సంక్షేమం పట్టని చంద్రబాబు

• కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పరిపాలన చేసిన చంద్రబాబునాయుడు ఏనాడు పేదల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, కనీసం పేదలకు ఇంటి కోసం జానెడు స్థలం కూడా ఇవ్వలేదని, ఆయన నాయకత్వంలోని టీడీపీ నాయకులు సైతం పేదల పాలిట పాపాత్ములుగా ప్రవర్తిస్తున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మండిపడ్డారు. కావలిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబు, టీడీపీ నాయకులు పేదలను ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారన్నారు. ఏనాడు పేదలు సంక్షేమాన్ని వారు ఆలోచించిన పాపాన పోలేదని ధ్వజమెత్తారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల పక్షపాతిగా కుల, మత రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. దీన్ని చూసి టీడీపీ నాయకులు కడుపు మంటతో రగిలిపోతున్నారన్నారు. పేదలకు ఇంటి స్థలాలు ఇస్తుంటే టీడీపీ నాయకులు కోర్టుల ద్వారా అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.



మాట్లాడుతున్న కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

పేదల ఓట్లు తొలగించేందుకు కుట్రలు

దొంగ ఓట్లతో గెలిచే నీచమైన చరిత్ర కలిగిన టీడీపీ నాయకులు తాజాగా కొత్తశైలిలో పేదల ఓట్లను తొలగించేందుకు కుట్రలు పన్నుతూ నిద్రాహారాలు మాని శ్రమిస్తున్నారని ఎమ్మెల్యే ఎద్దేవా చేశారు. కావలిలో సుమారు 6వేలకు పైగా ఓట్లు తొలగించడానికి టీడీపీ నాయకులు జాబితాను సిద్ధం చేశారని ఆరోపించారు. అందులో బతికున్న వారు, వివిధ పనులు నిమిత్తం బయట ప్రాంతాలకు వెళ్లిన వారు సైతం ఉన్నారని వెల్లడించారు. ఈ విషయమై తాను వైఎస్సార్‌సీపీ నాయకులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి అర్హుల ఓట్లు తొలిగించకుండా చూడాలని అప్రమత్తం చేయగా, దానికి ఎల్లో మీడియా తానేదో దొంగ ఓట్లు తొలగించకుండా చూడాలని చెప్పినట్లుగా దుష్ప్రచారం చేసిందన్నారు. ఎల్లో మీడియా, టీడీపీ నాయకులు వారు చేస్తున్న నీచమైన పనులను దాచిపెట్టి, ప్రజలను తప్పుదోవ పట్టించడానికి తాము ఏదో తప్పు చేస్తున్నట్లుగా అసత్య కథనాలను ప్రచారం చేస్తే ఉపేక్షించబోమన్నారు. చట్టపరంగా అన్ని రకాల చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమన్నారు. ఏఎంసీ చైర్మన్ ఎస్ ప్రసాద్, పార్టీ నాయకులు కే శివకుమార్‌రెడ్డి, కే వెంకట నారాయణ, జీ మహేంద్ర యాదవ్, ఎస్ వెంకటేశ్వరరెడ్డి, ఎస్ సీతారావమ్మ, కే శ్రీనివాసులు, పీ కామరాజు, జీ ప్రసన్నాంజనేయులు, కే జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు మహాశక్తిగా ఎదగాలి

నెల్లూరు(బృందావనం): రాష్ట్రంలోని మాలల సంక్షేమం కోసమే మాలమహానాడు ఆవిర్భవించిందని, వారి ఉన్నతి కోసం అలుపెరుగని పోరాటం చేస్తోందని, భవిష్యత్తులో మాల మహానాడు మహాశక్తిగా ఎదగాలని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు ఎనమల సుదర్శన్ అన్నారు. మాలహానాడు ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా నగరంలోని పురమందిరంలో శుక్రవారం నిర్వహించిన జిల్లా మహాసభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మాలల హక్కుల సంరక్షణ, షెడ్యూల్డ్ కులాల ఐక్యత, హక్కుల కోసం 1997లో దివంగత పీవీరావు నాయకత్వంలో మాలమహానాడు ఏర్పాటైందన్నారు. నాటి నుంచి నేటి వరకు మాలమహానాడు సాగిస్తున్న పోరాటాలు, సాధించిన విజయాలను వివరించారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు స్వర్ణ వెంకయ్య మాట్లాడుతూ మాలల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. మాలల అభివృద్ధికి గతంలో మాదిరి సబ్సిడీ రుణాలను పునరుద్ధరించి ఆదుకోవాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీచేయాలని, కారుణ్య నియామకాలకు పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్హతను సడలించాలని కోరారు. సత్ప్రవర్తనతో మెలుగుతున్న మాలలపై ఉన్న రౌడీషీట్లను తొలగించాలని, దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని విజ్ఞప్తి చేశారు. తొలుత ఏబీఎం కాంపౌండ్ నుంచి వీఆర్సీ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. జిల్లా అధ్యక్షుడు బల్లి వెంకయ్య, గద్దె బాబు, ఉద్యోగ సంఘాల నాయకులు జగన్నాథ్, రామారావు, విజయకుమార్, ఎర్రా శాస్త్రి, మధుసూదన్‌రావు, మహిళా నాయకులు సుజాతమ్మ, సెల్వమ్మ పాల్గొన్నారు.



ఎనమల సుదర్శన్‌ను సత్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

గిరిజన బాలికపై లైంగికదాడికి యత్నం


అల్లూరు: మండలంలోని తూర్పుగోగులపల్లికి చెందిన గిరిజన బాలిక (9)పై ఓ యువకుడు శుక్రవారం లైంగికదాడికి యత్నించాడు. ఉదయం తల్లిదండ్రులు కూలి పనులకు వెళ్లగా బాలిక ఇంట్లో ఒంటరిగా ఉంది. ఆ సమయంలో గ్రామానికి చెందిన ద్వారపాక క్రాంతి (25) అనే యువకుడు ఇంట్లోకి దూరి బాలికపై లైంగికదాడికి యత్నించాడు. అదే సమయంలో బాలిక తండ్రి ఇంటికి రావడం చూసి యువకుడు పరారయ్యాడు. బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

రేపు మెగా ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు సిటీ: నగరంలోని చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్‌లో ఈ నెల 13న ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధినేత ఎస్‌బీ రమేష్‌బాబు తెలిపారు. నగరంలోని చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్థ 12వ వార్షికోత్సవం, 77వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చెన్నైలోని మీనాక్షి డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్స్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గ్రహణమొర్రి, గ్రహణశూల, ముఖం, దవడలు వంకర, చిరునాలుక చీలిక, దంతాల అమరికలో ఇబ్బందులు, తదితర లక్షణాలతో బాధపడుతున్న వారికి వైద్యసేవలు అందించనున్నట్లు చెప్పారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా చేయడంతో పాటు మందులు, రూము, భోజనం, తదితర వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. వివరాలకు 93999 99990, 93999 99951 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

నెల్లూరులో ఫిష్ ఆక్వేరియం ఎగ్జిబిషన్

నెల్లూరు(బృందావనం): జిల్లా ప్రజలకు విజ్ఞానం, వినోదంతో పాటు ఉల్లాసాన్ని అందించే విధంగా నగరంలోని ఎస్వీజీఎస్ మైదానంలో అండర్ టన్నెల్ ఫిష్ ఆక్వేరియం, హ్యాండ్‌లూమ్ హ్యాండీక్రాఫ్ట్ ఫన్ ఫెయిర్ ఎగ్జిబిషన్‌ను శనివారం ప్రారంభిస్తున్నామని ఎగ్జిబిషన్ అధినేత ఎం రాజారెడ్డి, నిర్వాహకుడు బాబు తెలిపారు. శుక్రవారం వారు ఎగ్జిబిషన్ వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు సుమారు రూ.4.50 కోట్లతో 11 ఎకరాల విస్తీర్ణంలో ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా ప్రజలు చూడని భారీ సముద్ర, నదుల్లోని చేపలతో ఎగ్జిబిషన్‌లో ప్రదర్శిస్తున్నామని చెప్పారు. అమెజాన్ నదిలో ఉండే 160కిలోల బరువు, 6అడుగుల పొడవైన అరాపైమా, 8కిలోల స్టింగ్‌రే, సముద్రంలోని ఎలక్ట్రికల్ ఈల్స్, 5.5 అడుగుల అలిగేటర్‌గార్స్, టార్టాయిస్‌లు, ఫ్లయింగ్‌ఫిష్, షార్క్, ఈగల్, ఆర్వాణాలు, తదితర 3500 రకాల చేపలు ప్రత్యేక ఆకర్షణ గా నిలవనున్నాయని వివరించారు. అలాగే కొత్తరకం 22 ఎమ్యూజ్‌మెంట్ రైడ్స్, 100కు పైగా స్టాల్స్, 450కుపైగా తినుబండారాల దుకాణాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ఉదయం 11 నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ తెరిచి ఉంటుందని తెలిపారు. మూడు నెలల పాటు ఎగ్జిబిషన్ ఉంటుందని, జిల్లా ప్రజలు ఆదరించాలని కోరారు.



అండర్ టన్నెల్ ఆక్వేరియం

సచివాలయంలోని కంప్యూటర్ల చోరీ

నెల్లూరు(క్రైమ్): నగరంలోని బాలాజీనగర్‌లోని 15వ వార్డు సచివాలయంలోని కంప్యూటర్లను గుర్తుతెలియని దుండగులు అపహరించుకెళ్లారు. ఈ ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 9న సాయంత్రం సచివాలయ ఉద్యోగులు రోజూలాగే సచివాలయానికి తాళం వేసి వెళ్లారు. రాత్రి వేళ గుర్తుతెలియని దుండగులు సచివాలయం తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించారు. అందులోని రూ.60వేల విలువైన నాలుగు కంప్యూటర్లను అపహరించుకెళ్లారు. ఈ నెల 10వ తేదీ ఉదయం సచివాలయానికి వచ్చిన శానిటరీ సిబ్బంది తలుపులు తెరిచి ఉండడం, కంప్యూటర్లు మాయం అవడాన్ని గుర్తించి అడ్మిన్ సెక్రటరీ డీ సుధారాణికి సమాచారం అందించారు. ఆమె చోరీ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి వారి సూచనల మేరకు బాలాజీనగర్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఎస్సై కే సుమన్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఎస్ బ్యాంక్‌లో అగ్నిప్రమాదం

నెల్లూరు(క్రైమ్): నగరంలోని వీఆర్సీ సెంటర్ సమీపంలోని ఎస్ బ్యాంకులో శుక్రవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో జనరేటర్ గదిలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో దట్టమైన పొగలు అలుముకోవడంతో బ్యాంకు నుంచి సిబ్బందితో పాటు ఖాతాదారులు బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా వారు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.50వేల మేర నష్టం వాటిల్లి ఉంటుందని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.



విద్యుత్ వైర్లను పరిశీలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది



బ్యాంకు బయటకు వచ్చిన సిబ్బంది, ఖాతాదారులు

బద్దిపూడిలో రెవెన్యూ మంత్రి ధర్మాన

ఉలవపాడు: మండలంలోని బద్దిపూడిలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు శుక్రవారం పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. గురువారం రాత్రి మంత్రి ధర్మాన ఆత్మకూరు నుంచి విజయవాడ వెళుతూ బద్దిపూడిలోని రాఘవరెడ్డి నివాసంలో బస చేశారు. శుక్రవారం ఉదయం రెవెన్యూ శాఖ అధికారుల సమక్షంలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. బద్దిపూడికి చెందిన 9 మంది తమ సమస్యలను మంత్రికి విన్నవించారు. గ్రామ రికార్డులతో తహసీల్దార్ బ్రహ్మయ్య, సిబ్బంది ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. అసైన్‌మెంట్ భూముల సమస్యలను పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. గ్రామంలోని వైఎస్సార్ విగ్రహానికి మంత్రి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రికి గ్రామస్తులు ఎద్దుల బండి జ్ఞాపిక, ఆయన చిత్రపటాన్ని బహూకరించారు. కాగా మంత్రి ధర్మానను కలవడానికి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వచ్చేలోపే ఆయన వెళ్లిపోయారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యేను గ్రామస్తులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో కేవీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాఘవరెడ్డి, సర్పంచ్ అనిల్‌రెడ్డి, తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ చెంచమ్మ పాల్గొన్నారు.



రెవెన్యూ సమస్యలపై అర్జీలను స్వీకరిస్తున్న మంత్రి ధర్మాన

నిమ్మధరలు : పొదలకూరు (కిలో)

పెద్దవి: రూ. 40
సన్నవి: రూ.20
పండ్లు: రూ. 7



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.138
లేయర్	రూ.92
బ్రాయిలర్ చికెన్:	రూ.238
స్కిన్‌లెస్ చికెన్:	రూ.264
లేయర్ చికెన్:	రూ.156

